క్లుప్తంగా

సేంద్రియ సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): సేంద్రియ సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని లయోలా అకాడమీ, కేవీకే వ్యవసాయ విద్యార్థులు సూచించారు. శనివారం మండల పరిధిలోని గోమారంలో వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీవ ఎరువుల వినియోగం, ఆధునిక సాగు వ్యవసాయ ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు బొమ్మాజి, లావణ్య, నిఖిత, వందన, జ్యోతిక, లావణ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ పరిశీలకురాలిని కలిసిన నాయకులు



ఏఐసీసీ పరిశీలకురాలిని సన్మానిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రూతెలను శనివారం జోగిపేట మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మండలంలో మంత్రి దామోదర రాజనర్సింహ చేస్తున్న అభివృద్ధిని వివరించినట్లు తెలిపారు. అనంతరం డీసీసీ అధ్యక్షుల ఎంపికకు అభిప్రాయ సేకరణకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాన్‌కిషన్, విష్ణువర్ధన్‌రెడ్డి, యూసూఫ్, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, సత్యం, పాపయ్య, కిషోర్, సంగమేశ్వర్‌గౌడ్, మజహర్, లక్ష్మణ్, భరత్, రవిశంకర్, విఠల్, అంజయ్య, భిక్షపతి, సామెల్ పాల్గొన్నారు.

కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి


రైతులతో ఏఓ రాజేశ్

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి రాజేశ్ సూచించారు. ఈ మేరకు శనివారం రెడ్డిపల్లిలో కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, మొబైల్ నంబర్‌తో లాగిన్ చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకోకుండా సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించడానికి వీలుండదన్నారు. రైతులకు సంబంధించిన నంబర్ పని చేయకుంటే, వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద కొత్త నంబర్ అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవీన్, రైతులు పాల్గొన్నారు.

ప్రగతి ధర్మారంలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారంలో శనివారం కాంగ్రెస్ నాయకుడు, లీలా గ్రూపు చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ల బృందం గ్రామస్తులను పరీక్షించి మందులు అందజేశారు. అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ శిబిరంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు ధీటుగా సౌకర్యాలు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ కళాశాలలో ప్రైవేట్‌కు ధీటుగా సదుపాయాలు కల్పిస్తున్నట్లు స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్తయ్య అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థినిల కోసం సొంత ఖర్చులతో వేయిటింగ్ హాల్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ సత్యనారాయణ, నాయకులు సదానందం, బ్రహ్మం, రాములు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని తిమ్మక్కపల్లి సమీపంలో వెల్దుర్తి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో వాహనాలు అందులో పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రశాంతంగా బీసీ బంద్

బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అఖిల పక్ష నాయకులు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బీసీ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నిజాంపేట, చిలప్‌చెడ్, వెల్దుర్తి, రామాయంపేట, అల్లాదుర్గం, టేక్మాల్, రేగోడ్, శివ్వంపేట, హవేళిఘణాపూర్, కౌడిపల్లి, చేగుంట, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట మండలాల్లో ప్రధాన రహదారులపై బీసీ సంఘం నాయకులు బైఠాయించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ నాయకులు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. – సాక్షి నెట్ వర్క్


రామాయంపేటలో మూతపడిన దుకాణాలు


పాపన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల పక్షం నాయకులు


చిలప్‌చెడ్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు


టేక్మాల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


శివ్వంపేటలో రాస్తారోకో చేస్తున్న నాయకులు


నర్సాపూర్ ఆర్టీసీ డిపోలో నిలిచిన బస్సులు


మనోహరాబాద్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు


రేగోడ్: దుకాణాలను బంద్ చేయిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

రైతులు విద్యుత్ మరమ్మతులు చేయొద్దు

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి సమస్యలు వస్తే రైతులు స్వయంగా మరమ్మతులు చేయొద్దని సూరారం లైన్‌మెన్ భిక్షపతి సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని సూరారంలో శనివారం విద్యుత్ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల విద్యుత్ ఫీజ్‌తో పాటు ఎలాంటి సమస్య నెలకొన్న ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించాలని చెప్పారు. రైతులు స్వయంగా మరమ్మతులు చేసి ప్రమాదాల బారిన పడవద్దన్నారు. సమాచారం అందిస్తే తమ సిబ్బందితో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న లైన్‌మెన్ భిక్షపతి

తాగునీటికి తండ్లాట!

- నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా
- మూడు గ్రామాల్లో తప్పని నీటి కష్టాలు
- పట్టించుకోని అధికారులు

రేగోడ్(మెదక్): ఇంటింటికీ తాగునీటిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ లక్ష్యం మంచిదే అయినప్పటికీ నీటి సరఫరా చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంతకాలంగా మిషన్ భగీరథ నీళ్ల సరఫరా నిలిచిపోయినా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వివరాల ప్రకారం .. మండలంలోని మక్త వెంకటాపూర్, కొత్వాన్‌పల్లి, తిమ్మాపూర్ గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్ల సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పాడి పశువులు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. అయితే కొంత కాలంగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు శనివారం మీడియా దృష్టికి తీసుకొచ్చారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో నీటి కోసం వ్యవసాయ పొలాల్లో ఉన్న బోరు బావుల పరుగులు పెడుతున్నామన్నారు. తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు. ఇక, సర్పంచ్ లేకపోవడం, పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వెంకటాపూర్ గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వెంకటాపూర్‌లో తాగునీటి కోసం నల్లా వద్ద నిరీక్షిస్తున్న గ్రామస్తులు

కార్యదర్శి వివరణ..

తాగునీటి విషయంపై వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. గత వారం రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. నీటి సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు


అయ్యప్పస్వాములతో కాళ్లకల్ గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ నిర్మల్ ఆధ్వర్యంలో బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం నుంచి అయ్యప్ప స్వాములు శబరిమలకు పాదయాత్రగా బయలు దేరారు. ఈ సందర్భంగా శనివారం అయ్యప్ప స్వాములు మండలంలోని కాళ్లకల్‌కి రావడంతో బీజేపీ నాయకులు నత్తి మల్లేష్ ప్రత్యేక ఆహ్వానం పలికారు. అనంతరం వారిని సన్మానించారు. అనంతరం బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలలోనే చెత్తకుప్ప!

- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న విద్యార్థులు
- ప్రత్యామ్నాయం చూడాలని కోరుతున్న స్థానికులు

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాలలో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త కోసం తాత్కాలికంగా ఓ గుంతను తీసి అందులోనే వ్యర్థ పదార్థాలను వేస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. అయితే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన ఉపాధ్యాయులే చెత్తకుప్పను ఏర్పాటు చేయడం విమర్శలకు దారితీస్తుంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు తిన్న తర్వాత మిగిలిన పదార్థాలను ఈ చెత్తకుప్పలో వేస్తుండడంతో అపరిశుభ్రతగా మారుతోంది. వర్షాలకు కుళ్లి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడనుందని ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా పాఠశాల ప్రహరీకి సమీపంలో నివాస గృహాలు ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. అంతేకాకుండా కోతులు సంచారం ఎక్కువగా ఉందని, ఇక్కడ పడేసిన పదార్థాలను తీసుకెళ్లే క్రమంలో నివాస గృహాలపై పడుతుందని అంటున్నారు. దీనికి తోడు చెత్తకుప్పతో ఈగలు, దోమలు పెరిగి తమ ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జెడ్పీపాఠశాల హెచ్‌ఎం, జీపీ ఈఓకు చెప్పిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెత్తకుప్పను తొలగించాలని కోరారు.


జెడ్పీపాఠశాలలో పేరుకుపోయిన చెత్త

కాంగ్రెస్‌లో చేరిక

శివ్వంపేట(నర్సాపూర్): పార్టీ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని నర్సాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పిల్లుట్లకి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ మురళిగౌడ్, మధు, సతీష్, స్వామి తదితరులు ఉన్నారు.

ఉన్నత పాఠశాలలో కాళోజీ కళాతోరణం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సౌజన్యంతో కాళోజీ కళాతోరణం నిర్మించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు బడికి ఏమైనా చేయాలనే తపనతో కొంత నగదు సేకరించారన్నారు. అనంతరం స్టేజి నిర్మించి పూర్తి చేసి కాళోజీ కళాతోరణంగా నామకరణం చేశారు. ఈ కళాతోరణానికి టీచర్లు సైతం తమ వంతు సహాయం చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న జేసీబీ

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని అలీనగర్ సర్వే నంబర్ 27లో ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులకు తహసీల్దార్ దేవదాస్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ మున్సిపల్ అధికారుల సహకారంతో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే సహించబోమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పరిశుభ్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

నారాయణఖేడ్: చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పట్టణవాసులు సహకరించాలని మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ కోరారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని 10వ వార్డు కాలనీవాసులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. మహిళలకు తడి, పొడి చెత్త, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను మున్సిపాలిటీ వాహనంలో వేసి సహకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు సంక్షేమానికి ఎఫ్‌పీఓ కృషి

ఎఫ్‌ఈఓ సంఘం సీఈఓ వెంకటేశం

టేక్మాల్(మెదక్): గ్రామీణ ప్రాంత రైతుల సంక్షేమానికి రైతు ఉత్పాదక సహకార సంఘం ఎంతో కృషి చేస్తుందని ఆ సంఘం సీఈఓ వెంకటేశం తెలిపారు. శనివారం మండలంలోని కుసంగిలో రైతు సంఘం ఆధ్వర్యంలో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఐసీఐ ఫౌండేషన్ సౌజన్యంతో వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామన్నారు. ఈ పరికరాలను భద్రపరిచేందుకు షెడ్డు నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా రైతు సంఘం తరపున వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు మొగులయ్య, మాజీ జిల్లా కో–ఆప్షన్ సభ్యులు యూసూఫ్, మాజీ సర్పంచ్ మొగుల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, నాయకులు లక్ష్మయ్య, అంజయ్య, మైపాల్‌రెడ్డి, నారాయణగౌడ్, విక్రంగౌడ్, వీరారెడ్డి, సుబ్బారావ్ తదితరులు పాల్గొన్నారు.


కుసంగిలో భూమిపూజ చేస్తున్న నాయకులు

రాంకిషన్ సేవలు చిరస్మరణీయం

డీఈఓ రాధాకిషన్


మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

పాపన్నపేట(మెదక్): ప్రధానోపాధ్యాయుడు ఆకుల రాంకిషన్ సేవలు చిరస్మరణీయమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంకిషన్ పదవీ విరమణ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమన్నారు. సమాజంలో టీచర్లకు గౌరవం ఉందన్నారు. పదవీ విరమణ అనంతరం సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ చైతన్య పర్చాలని కోరారు. అనంతరం ఆయనను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ రాజిరెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం నజీరొద్దీన్, రిటైర్డ్ వైద్యాధికారి చంద్రశేఖర్, పీడీ ఆనందం, కొండల్ రెడ్డి, నీల కంఠం, మధుమోహన్, టీచర్లు శ్రీనివాస్, అశోక్, కుమార్, నర్సింలు, సిద్దేశ్వర్, ముజీబ్, కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ బీసీలకు, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం చేపట్టిన బంద్‌కు మద్దతు పలికారు. అనంతరం రామాయంపేటలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా తాము కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మెట్టు గంగారాం, నాయకులు దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నిజాంపేట(మెదక్): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని నందగోకుల్, నస్కల్, కల్వకుంట, తిప్పన్నగుల్ల గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పరిశీలించారు. అనంతరం బచ్చురాజ్‌పల్లి, జెడ్ చెరువు తండా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కాంట్రాక్టర్లు లబ్ధిపొందారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో డబ్బులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, అమర సేనారెడ్డి, శ్రీనివాస్, అజయ్, సుప్రభాత రావు, యాదగిరి, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీఓ రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


జెడ్‌చెరువుతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ వీరేశం

రేగోడ్(మెదక్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ వీరేశం తెలిపారు. జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గజ్వాడలో శనివారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పశు పోషకుడు తమ పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. వ్యాధి సోకిన అనంతరం చికిత్స చేయించే బదులు నివారణ టీకాలు వేయించడం ఉత్తమమన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఎస్టీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు శనివారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్ మండలాలకు సంబంధించి ఈ ప్రాంతంలో ఎస్టీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే ఉద్యోగులకు ఇబ్బందులు దూరమవుతాయన్నారు. దీంతో పాటు పేటలో ఫైర్‌స్టేషన్‌ను ఇతర ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, దీనిని ఎక్కడికి తరలించొద్దని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌గౌడ్, సుభాష్, దత్తు, నర్సింహచారి, రవీందర్, యాదుల్, సాయిలు, అశ్విన్, అశోక్ తదితరులున్నారు.

ఉత్తమ పనితీరుపై అభినందన

పెద్దశంకరంపేట(మెదక్): రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పనితీరుపై మండల సంఘం అధ్యక్షుడు సాంబయ్యగారి నర్సింహులును జిల్లాలోని 14 మండలాల సంఘాల సభ్యులు సన్మానించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన సభ్యురాలు మన్నె స్వరూపను రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.


నర్సింహులును సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నీటి వృథాను అరికట్టాలి

శివ్వంపేట(నర్సాపూర్): ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని పెద్ద చెరువు నిండుకుండలా మారింది. అయితే అలుగు భాగంలో లీకేజీల కారణంగా నీళ్లు వృథాగా పోతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కొంతకాలంగా నీళ్లు వృథాగా పోతున్నా సంబంధిత ఇరిగేషన్ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. ఈ మేరకు శనివారం రైతులు అలుగు వద్ద నిరసన వ్యక్తం చేశారు. చెరువులో నుంచి అలుగు లీకేజీతో 20 రోజుల నుంచి నీరు వృథాగా పోతున్నట్లు సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని ఆందోళన చెందుతున్నారు. నిరసనలో రైతులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, షేక్‌అలీ, సురేష్ నాయక్, మైసయ్య, సత్తయ్య ఉన్నారు.


అలుగు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు